www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 23 ఆగస్టు 2024

5

పశ్చిమ గోదావరి

హైస్కూల్ గ్రౌండ్ అభివృద్ధి : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం: ప్రభుత్వ నిధులు, దాతల సహకారంతో సుమారు రూ.10 లక్షలతో తేతలి సత్యనారాయణమూర్తి జిల్లా పరిషత్ హై స్కూల్ ప్లే గ్రౌండ్ వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఆయన జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ రూ.6 లక్షల ప్రభుత్వం నిధులతోనూ, మరో రూ.4 లక్షల దాతల సహకారంతో గ్రౌండ్ అభివృద్ధి పనులను చేయనున్నట్లు తెలిపారు. తాను ఇదే స్కూల్లో విద్యను అభ్యసించానని, లక్షల మంది విద్యార్థులు ఇదే స్కూల్లో చదువుకొని ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు. తన వంతుగా రూ.50 వేల విరాళాన్ని ప్రకటించారు. మన ఊరు మన స్కూలు పేరుతో దాతలు ముందుకు వచ్చి ఈ అభివృద్ధి కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ మురళీకృష్ణ, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.సత్యనారాయణ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గ్రామసభల సందడి

నేడు ప్రతి గ్రామ పంచాయతీలోనూ ఉపాధి హామీ సభలు

ఏలూరు జిల్లాలో 547, పశ్చిమలో 408 గ్రామ పంచాయతీల్లో సభలు

ప్రతి మండలానికీ ప్రత్యేక అధికారులు నియామకం

అభివృద్ధి పేరుతో అత్యధికంగా కాంపోనెంట్ పనులపైనే ప్రభుత్వం ఫోకస్

ఈ పనులతో ఉపాధి కూలీలకు పెద్దగా ప్రయోజనం శూన్యం

ఉపాధి హామీ జాబితాలో ప్రకటించిన 46 పనుల్లో అత్యధికం అంతే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఉపాధి హామీ పనులపై గ్రామసభలకు సిద్ధమైంది. శుక్రవారం ఏలూరు జిల్లాలో 547, పశ్చిమగోదావరి జిల్లాలో 408 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ గ్రామసభలు నిర్వహించేందుకు జిల్లా అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. గ్రామసభలను విజయవంతంగా జరిపేందుకు ప్రతి మండలానికి జిల్లాస్థాయి అధికారులను ప్రత్యేక అధికారిగా నియమించారు. గ్రామ పంచాయతీల్లో జరిగే గ్రామసభలో పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉండగా, మండలస్థాయి అధికారులు పాల్గొని గ్రామసభలు నిర్వహించనున్నారు. జిల్లా అధికారులు, మంత్రులు, ఎంఎల్ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున ఈ సభల్లో పాల్గొనున్నారు. ప్రభుత్వం ఉపాధి హామీ పనుల జాబితాలో 46 పనులు గుర్తించింది. గుర్తించిన జాబితాలో పనులకు సంబంధించి గ్రామసభల్లో చర్చ జరగనున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో అత్యధికం ఉపాధి కూలీలకు పెద్దగా ప్రయోజనం లేని పనులే ఉన్నాయి. ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో చెరువుల పూడికతీత పనులు లేవు. ఉపాధి కూలీలు అత్యధికంగా చేసే పనుల్లో చెరువుల పూడికతీతలే ఉంటాయి. ఆ పనులను ఉపాధి హామీ జాబితా నుంచి తొలగించడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి భూముల్లో చేపల చెరువుల పునరుద్ధరణ, వ్యక్తిగత భూముల్లో బెంచ్ టెర్రెసింగ్ నిర్మాణం, రైతుల పొలాల్లో గడ్డిపెంపకం, పశువులు, గొర్రెలు, కోళ్ల షెడ్ల నిర్మాణం వంటి పనుల్లో ఉపాధి కూలీలను ఉపయోగించే పరిస్థితి పెద్దగా ఉండదు. ప్రస్తుతం ఉపాధి హామీ పనుల్లో భాగంగా కూలీలకు వంద రోజులు పని కల్పిస్తున్నారు. పని దినాలను 200 రోజులకు పెంచాలని కూలీలు డిమాండ్ చేస్తున్నారు. అటువంటి పరిస్థితుల్లో కూలీలకు పనులు తగ్గించే విధంగా ప్రభుత్వం పనుల జాబితాను రూపొందించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం ప్రతిపాదించిన పనుల జాబితా పరిశీలిస్తే కూలీలకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికే సరాసరిన ఏడాదికి 30 రోజులు మాత్రమే ఉపాధి హామీ పని దినాలు జరుగుతున్నాయి. ఇప్పుడు మరింత తగ్గించే ఎత్తుగడకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగుతున్నాయనే విమర్శలు విన్పిస్తున్నాయి.

అత్యధికం కాంపోనెంట్ పనులపైనే దృష్టి

ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభల్లో అత్యధికం కాంపోనెంట్ (యంత్రాలు చేసే పనులు)పైనే దృష్టి సారించిన పరిస్థితి కన్పిస్తోంది. శుక్రవారం జరగనున్న గ్రామసభల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, బిటి రోడ్లకు సంబంధించిన పనులపై సభల్లో చర్చ జరగనున్నట్లు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో రూ.70 కోట్లు కాంపోనెంట్ పనులకు సంబంధించి గ్రామసభల్లో చర్చలు సాగనున్నాయి. ఏలూరు జిల్లాలోనూ అదే పరిస్థితి నెలకొంది. కాంపోనెంట్ పనుల్లో అత్యధికం యంత్రాలతోనే చేయిస్తారు. కూలీలకు పెద్దగా పనులు ఉండవు. గ్రామసభల్లో కూలీలకు ప్రయోజనం చేకూరేలా పనులు కల్పించేందుకు చర్చలు సాగించాలని అంతా కోరుతున్నారు. అప్పుడే గ్రామసభలకు ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం అభివృద్ధి పేరుతో ఉపాధి హామీ నిధులకు సంబంధించిన పనులను కాంపోనెంట్ పరిధిలోకి తీసుకెళ్తే కూలీలకు పనులు లేకుండాపోయే దుస్థితి ఏర్పడనుంది.

అర్హులు ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఓటర్లుగా నమోదవ్వాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయ నియోజకవర్గ ఓటర్లుగా జిల్లాలో అర్హులైన ప్రతిఒక్క ఉపాధ్యాయ, అధ్యాపకులు తప్పక నమోదు కావాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి కోరారు. గురువారం స్థానిక కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, వివిధ కళాశాలల ప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై ఉపాధ్యాయ ఓటర్ల నమోదుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 2024 నవంబర్ 1 క్వాలిఫైయింగ్ తేదీగా ఓటరు జాబితా సవరణలో భాగంగా గత నెల 29న నోటిఫికేషన్‌కు సంబంధించి పబ్లిక్ నోటీసు జారీ చేశారన్నారు. ఈ నేపథ్యంలో తూర్పు, పశ్చిమగోదావరి ఉపాధ్యాయ ఎంఎల్‌సి నియోజకవర్గ ఓటర్ల నమోదు ప్రక్రియపై అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. నూతన ఉపాధ్యాయ ఓటర్ల నమోదుకు ఓటర్ల నమోదు ఫారం-19 సమర్పించడానికి సెప్టెంబరు 3వ తేదీ తుదిగడువని, ఓటర్ల జాబితాలో క్లెయిమ్స్ అభ్యంతరాలు దాఖలు చేసేందుకు సెప్టెంబరు 24 నుంచి అక్టోబరు 15 వరకు అవకాశం ఉందన్నారు. అభ్యంతరాలను అక్టోబరు 30వ తేదీ నాటికి పరిష్కరించి తుది ఓటర్ల జాబితాను నవంబర్ 6న ప్రచురిస్తారన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేటు ఉన్నత పాఠశాలలు, ఐటిఐ, జూనియర్, డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలలకు చెందిన అధ్యాపకులు అర్హులని తెలిపారు. తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల నుండి దరఖాస్తులు పొందవచ్చని సూచించారు. కాకినాడ డివిజ రిజిస్ట్రేషన్ అధికారిగా వ్యవహరిస్తారని, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల కలెక్టర్లను ఎఇఆర్‌ఒలుగా నియమించారన్నారు. నిర్దేశ ఫారంలో ఓటు నమోదుకు పూరించి అనంతరం ఆధార్, సర్వీస్ సర్టిఫికెట్, డిడిఒ ధ్రువీకరణ సంతకం తదితరాలతో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. ఉపాధ్యాయ నియోజకవర్గంలో సాధారణ నివాసి అయి ఉండాలని, అర్హత తేదీకి ముందు ఆరు సంవత్సరాల్లోపు, కనీసం మూడు సంవత్సరాల పాటు, ఏదైనా విద్యాసంస్థలో బోధనలో నిమగ్నమై ఉండాలన్నారు. ఒక వ్యక్తి గత ఆరు సంవత్సరాల్లో కనీసం మూడు సంవత్సరాల పాటు నిర్దేశిత విద్యాసంస్థల్లో బోధించడంలో ఉండాలని, అది నిరంతర సర్వీస్‌గా గాని, విడివిడిగా సర్వీస్‌లోగాని ఉండవచ్చని తెలిపారు. పార్ట్ టైమ్ ఉపాధ్యాయులు దరఖాస్తుకు అనర్హులని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ జె.ఉదయభాస్కరరావు, డిఇఒ జి.నాగమణి, ఎన్నికల డిటి సన్యాసిరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు మరుపట్ల శ్యాంబాబు (టిడిపి), కె.రవికుమార్ (బిజెపి), బి.శివ (జనసేన), జిల్లాలోని వివిధ డిగ్రీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలల ప్రిన్సిపాల్స్, ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని సిఐటియు ఆందోళన

ప్రజాశక్తి - తణుకు

విశాఖపట్నంలో అచ్యుతాపురం ఫార్మా సెజ్‌లో రియాక్టర్ పేలి చనిపోయిన, నెల్లూరు ఎఫ్‌ఎఫ్‌ఎఫ్ పరిశ్రమలో చనిపోయిన ప్రతి కార్మికుని కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని, ఆయా యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నరేంద్ర సెంటర్లో పరిశ్రమల్లో ప్రమాదాలపై సిఐటియు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని పరిశ్రమల్లో భద్రతాపరమైన తనిఖీలు చేపట్టాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ.కోటి నష్ట పరిహారం ఇవ్వాలని, కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని, కార్మిక, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్ వారికీ పరిశ్రమల తనిఖీకి అనుమతులు ఇవ్వాలని, ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్స్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పెద్దత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రంలో రెండు పరిశ్రమల్లో 21 మంది కార్మికులు అన్యాయంగా చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక చట్టాల్లో మార్పులు కార్మికుల ప్రాణాలు హరిస్తున్నాయని విమర్శించారు. ఫార్మా, రసాయన పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు పెద్దఎత్తున జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం, అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం కార్మిక శాఖ, కార్మిక సంఘాలతో పరిశ్రమల్లో భద్రతపై చర్చలు జరపాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.దక్షిణామూర్తి, గుబ్బల గోపీ, వాన్‌బరి యూనియన్ కార్యదర్శి వల్లూరి వెంకటేశ్వరరావు, గార రంగారావు, యు.బాబ్జి, సయ్యద్ రషీద్, జి.గోవిందరావు, వై.రమణ, పి.వెంకన్న బాబు, ఎన్.శ్రీనివాసరావు, అంబటి బ్రహ్మాజీ, తరుణ్ తేజ తదితరులు పాల్గొన్నారు.

జోరు వర్షంలో నినదిస్తున్న కార్మిక నేతలు

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి

గ్రామస్తుల ఆందోళన

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడి గ్రామంలో ఇరిగేషన్ భూమిలో 2023 ఏప్రిల్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఒక భూస్వామి అభ్యంతరం తెలపడంతో గత 20 రోజుల క్రితం విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. 4, 5, 8 పంచాయతీ వార్డుల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయడంతో ఆప్రాంత వాసులు జిల్లా కలెక్టర్, ఉండి ఎంఎల్ఎ రఘురామకృష్ణ రాజు, విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించారు. దొడ్డనపూడి గ్రామంలో వివాదాస్పదంగా మారిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్, పోలీస్ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి, లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలంటూ దొడ్డనపూడి గ్రామస్తులు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆందోళన చేశారు. ఈ ప్రాంతంలో 300 కుటుంబాలు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, ఇతర సామాజిక వర్గాలు నివసిస్తున్నారు. విద్యుత్ సరఫరా నిలుపుదలతో పెద్దలు, చిన్నారులు, వృద్ధులు నానా అవస్థలు పడుతున్నారని అధికారులకు వివరించారు. ఆకివీడు సిఐ జగదీశ్వర్, ఎస్ఐ శ్రీనివాసరావు, ఎలక్ట్రికల్ ఎఇపి రాంబాబు, కొల్లి వెంకట రామారావు, కొల్లి పేరయ్య, యిర్రింకి వెంకటేశ్వరరావు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న పోలీస్, అధికారులు

అర్ధవరం మాజీ సర్పంచి మృతి

నివాళులర్పించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - గణపవరం

అర్ధవరం గ్రామ మాజీ సర్పంచి చిన్నం అయ్యన్న(72) అనారోగ్యం కారణంగా విజయవాడ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. మృతి చెందిన అయ్యన్నకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు కౌలురైతు, చిన్న కుమారుడు చిన్నం నాగేశ్వరరావు సిపిఎం మండల కమిటీ సభ్యులుగా, కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శిగా, రాష్ట్ర సభ్యులుగా కొనసాగుతున్నారు. మృతిచెందిన చిన్నం అయ్యన్న 1996-2001 గ్రామ సర్పంచిగా గ్రామాభివృద్ధికి కృషి చేశారు. ఆయన పదవీకాలం ముగిసిన తర్వాత కూడా కుటుంబ సభ్యులు, కుమారులు గ్రామాభివృద్ధికి విశేషమైన సేవలు అందించారు. గురువారం అయ్యన్న భౌతికకాయానికి సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు, సిపిఎం మండల కార్యదర్శి పిచ్చెట్టి నరసింహమూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం.ఆంజనేయులు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి మాదాసి గోపి, తెలుగు యువత ఉంగుటూరు నియోజకవర్గ నాయకులు అద్దేపల్లి వాసు, టిడిపి నాయకులు అద్దంకి సంసోను నివాళులర్పించారు.

నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు బలరాం, క్రాంతి

చిన్నయ్య మృతికి పలువురు సంఘీభావం

అర్ధవరం మాజీ సర్పంచి చిన్నం అయ్యన్న మృతి పట్ల సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల పరిషత్ అధ్యక్షులు దండు వెంకటరామరాజు(రాము) సంఘీభావం తెలిపి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

అప్సడా అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - గణపవరం

ఆక్వా రైతులకు అప్సడా అనుమతులు తప్పనిసరిగా ఉండాలని, అనుమతులు లేకపోతే వెంటనే అనుమతులు పొందాలని మత్స్యశాఖ అసిస్టెంట డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపేడా వారి ఆధ్వర్యాన స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన అవగాహనా సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఎంపెడా అధికారి గోపాలకృష్ణ మాట్లాడుతూ జిల్లా నుంచి ఎగుమతి అయ్యే ఆక్వా ఉత్పత్తుల కోసం వారివద్ద నమోదు చేసుకోవాలని అన్నారు. ధరల ఆటుపోట్లు, మార్కెట్ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేసుకొని సాగుచేయాలని రైతులకు వివరించారు. ఎంపెడా దరఖాస్తు ఏవిధంగా చేయాలో రైతులకు వివరించారు. గణపవరం ఎఫ్‌డిఒ శివరామకృష్ణ మాట్లాడుతూ రైతులు మంచి యాజమాన్య పద్ధతులు పాటించి ఎక్కువ ఉత్పత్తులు పొందవచ్చునని తెలిపారు. ఆక్వారైతులు 10 ఎకరాలకు మించిన వారికి విద్యుత్ సబ్సిడీ వర్తింపు పొందిన హెచరీల వివరాలను రైతులకు తెలిపే విధంగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మార్కెటింగ్ సమస్యలను పరిష్కరించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని అన్నారు. ఆక్వా రైతులు సాగుకు ఉపయోగపడే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సదస్సులో ఆక్వారైతులు, డీలర్లు, మత్స్యశాఖ సిబ్బంది షర్మిల, భాస్కర్, నాగేంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

హత్యాచారాన్ని ఖండిస్తూ ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన దోషులను కఠినంగా శిక్షించాలని, మహిళా చట్టాల్ని పటిష్టంగా అమలు చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం రూరల్ వెంప గ్రామంలోని బస్టాండ్ సెంటర్లో గురువారం సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ, ఆశా, పంచాయతీ కార్మికులు, హెల్త్ క్లీనిక్ ఉద్యోగస్తులు కలకత్తాలో ఆర్‌జికార్ మెడికల్ హాస్పిటల్లో జూనియర్ డాక్టర్‌పై హత్యాచారాన్ని ఖండిస్తూ ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. ఈ ర్యాలీకి సంఘీభావంగా ఆయుర్వేద డాక్టర్ రామచంద్రరావు మాట్లాడుతూ జూనియర్ డాక్టర్ హత్యాచారానికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళలు తమ రక్షణకు ఆయుధాలు కూడా తీసుకుని వెళ్లవలసిన పరిస్థితులు కూడా వస్తున్నాయన్నారు. సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ 78వ స్వాతంత్ర దినోత్సవం ఘనంగా జరుపుకున్నాం కానీ నేటికీ బాలికలు, మహిళలపై దేశవ్యాప్తంగా అత్యాచారాలు, హత్యలు కొనసాగుతూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ డాక్టర్ హత్యాచార కేసులో సిబిఐ విచారణ వేగవంతం చేసి ఎంతటి వారినైనా విడిచి పెట్టకుండా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విలేజ్ హెల్త్‌క్లినిక్ ఉద్యోగస్తులు ఆశాజ్యోతి, లిఖిత, సానబోయిన కృష్ణారావు, సత్యనారాయణ, బి.చిట్టి, మేరి, టి,గౌరి, కె.పౌల్‌రాజు, బి.వెంకటలక్ష్మి, బి.ప్రసన్న, దిడ్ల సునీత, పోతునీడి లక్ష్మి నర్సమ్మ, జక్కంశెట్టి రామలక్ష్మి పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

పలుచోట్ల వర్షం

ప్రజాశక్తి - పెనుమంట్ర

అంతవరకూ మాడు పేలగొట్టేలా ఎండ కాసి, ఆవెంటనే మేఘాలతో ఏకదాటిగా గురువారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ముఖ్యంగా అద్వాన్నంగా ఉన్న పలుగ్రామాల రహదారులు, లింకు రోడ్లు నీరు చేరి బురదమయంగా మారాయి. కొయ్యేటిపాడు, సత్యవరం, మార్టేరు, వెలగలవారి పాలెం రోడ్ల పరిస్థితి వర్ణనాతీతం.

పాలకొల్లు : పాలకొల్లులో మధ్యాహ్నం తేలికపాటి వర్షం దంచి కొట్టింది. రోజులో ఏదో సమయంలో వర్షం పడుతూనే ఉంది. దీంతో వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పలుచోట్ల మున్సిపాలిటీ డ్రెయిన్‌లలో సిల్ట్ తీస్తోంది. దీంతో తీసిన సిల్ట్ తిరిగి డ్రెయిన్లలో పడుతోందని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంతో బిల్డింగ్ పనులు నిలిచిపోతున్నాయని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కారణంగా వివాహవేడుకలు జరుపుకునే వారు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

ఆచంట: మండలంలో గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఆర్అండ్‌బి రహదారులు అద్వాన స్థితికి చేరుకున్నాయి. మండలంలోని ఆచంట వేమవరం ప్రధాన రహదారి పూర్తిగా శిధిలావస్థకు చేరుకుంది. ద్విచక్ర వాహనదారులు సైతం ఈ రహదారుల్లో ప్రయాణించడానికి భయపడుతున్నారు. ఏడాదికాలంగా రహదారి పెద్ద పెద్ద గోతులు పడి, రాళ్లు పైకి లేచిపోయి శిధిలావస్థకు చేరుకుంది. దీంతో ఆర్‌టిసి బస్సులు సైతం ఒరిగిపోతూ ప్రమాద స్థాయిలో నడుస్తున్నాయి. వాహనదారులు ఆ గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. తక్షణమే అధికారులు స్పందించి కనీసం గోతులైన పూడ్చాలని ప్రయాణికులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ఆచంట : గోతులమయమైన రహదారిలో నిలిచిన వర్షం నీరు

'కేటాయించిన స్థలాల్లోనే మాంసం విక్రయాలు'

ఉండి: మాంసం దుకాణాదారులు వారికి కేటాయించిన స్థలాల్లోనే మాంసం విక్రయాలు జరపాలని ఉండి గ్రామపంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ అన్నారు. గురువారం సాయంత్రం ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణరాజు ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది మాంసం దుకాణదారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ ఉండి ప్రధాన పంట కాలువని అనుకుని ఇప్పటి వరకు మాంసం దుకాణదారులు విక్రయాలు జరపడమే కాకుండా వాటి వ్యర్థ పదార్థాలను పంట కాలువలో వేయడంతో నీరు పూర్తిగా కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఎంఎల్ఎ దృష్టికి వెళ్లడంతో స్పందించిన ఆయన వెంటనే గతంలో ఉండి సంతలో వారి కోసం ఏర్పాటు చేసిన దుకాణాల్లోనే వ్యాపారం చేసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి, ముదునూరి కృష్ణంరాజు ఉన్నారు.

ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు

5.30 లక్షల టన్నులు ధాన్యం సేకరించాలి

ప్రతి ధాన్యపు గింజ కొనుగోలు చేసేలా చర్యలు

జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. 2.10 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారని, 5.30 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని సేకరించేలా లక్ష్యం చేసుకోవాలన్నారు. రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజనూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు ముందస్తు చర్యలపై సంబంధిత అధికారులు, రైసుమిల్లర్ల అధ్యక్షులు, ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం కొనుగోలుకు 264 రైతు సహాయక కేంద్రాలు సిద్ధం చేసుకోవాలని, దీనికి అనుగుణంగా మౌలిక సదుపాయాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. మూడు వేల వాహనాలను సిద్ధం చేసుకోవాలన్నారు. కోటీ 32 లక్షల 50 వేలు గోనె సంచులు సిద్ధం చేసుకోవాలన్నారు. అదనపు సిబ్బంది నియామకం చేసుకుని సిబ్బందికి ట్రైనింగ్ కార్యక్రమాలు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలోని సమస్యల తక్షణ పరిష్కారానికి జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసుకుని, 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలో గ్రామ, మండల, జిల్లాస్థాయిలో అవగాహనా సదస్సులు నిర్వహించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు పండించిన ధాన్యాన్ని వారి సమీపంలోని నచ్చిన రైసుమిల్లులకు తరలించే అవకాశాన్ని కల్పించినట్లు తెలిపారు. ఖరీఫ్ సీజన్లో రైతులకు కనీస మద్దతు ధర ఒక క్వింటాలు సాధారణ రకం రూ.2,300, గ్రేడ్-ఎ రకం రూ.2320 అందించి నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారన్నారు. రైతులు పంట కోసే మూడు రోజులు ముందు వారికి కావాల్సిన గోనె సంచులు అందజేయాలన్నారు. ప్రతి ఆర్‌బికెలో తగినన్ని గోనె సంచులు నిల్వ ఉంచుకోవాలని, ఎక్కడా గోనె సంచుల కొరత రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ, ఎఫ్‌సిఐ మేనేజర్ జి.రంజిత, జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి టి.ఉమా మహేశ్వరరావు, డిసిఒ ఎం.నాగరాజు, ఇన్‌ఛార్జి జిల్లా వ్యవసాయ శాఖాధికారి కెఎస్ఎస్.శ్రీనివాసరావు, జిల్లా రైసుమిల్లర్స్ అధ్యక్షులు సామంతపూడి శ్రీ రామరాజు, కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను ఆదరించాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను జాలితో చూడకుండా ప్రేమతో ఆదరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం శివరావుపేట గాలి రామయ్య మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ఏర్పాటు చేసిన భవిత సెంటర్ (విభిన్న ప్రతిభావంతులు)ను ఆమె గురువారం సందర్శించారు. విభిన్న ప్రతిభావంతులకు అందిస్తున్న బోధనా విధానాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు కలిగిన బాల బాలికలను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు, సిబ్బంది నిరంతరం కృషి చేయాలన్నారు. ఫిజియోథెరపీ ఉపకరణాలు, ఆట వస్తువులు, వీల్‌ఛైర్స్, తదితర సామగ్రి ఉంచిన గదిని పరిశీలించి, వాటిని వినియోగిస్తున్న విధానం అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో 19 భవిత కేంద్రాలు ఉన్నాయని, వాటిలో ప్రత్యేక అవసరాల విద్యా బోధనకు 38 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారని, ఏడుగురు ఫిజియోథెరపిస్టులు ఉన్నారని తెలిపారు. అవసరమైన పిల్లలకు వీల్‌ఛైర్స్, కళ్లజోళ్లు, చెవిటి మిషన్లు వంటి ఉపకరణాలను ఉచితంగా ఇవ్వడంతోపాటు భవిత సెంటర్‌కు పిల్లలను తీసుకొచ్చేవారికి రవాణా ఛార్జీల నిమిత్తం రూ.3 వేలు విద్యార్థుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఇఒ జి.నాగమణి, ఎస్ఎస్ఎ పిఒ శ్యాంసుందర్, మధ్యాహ్న భోజనం-పాఠశాలల పారిశుధ్యం కోఆర్డినేటర్ కె.కృష్ణారావు, ఎంఇఒలు ఎన్.శ్రీనివాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, హెడ్‌మాస్టర్ దుర్గాభవాని, ఐఇ కోఆర్డినేటర్ సిహెచ్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చిన్నారులతో కలెక్టర్ నాగరాణి

సొసైటీలను కంప్యూటరీకరించాలి

జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - కాళ్ల

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ పనులు వెంటనే పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కోపల్లెలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని సందర్శించి కంప్యూటరైజేషన్ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సహకార సంఘాల్లో సభ్యత్వం కలిగిన సభ్యుల వివరాలను కంప్యూటరీకరించాలన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి ప్యాక్స్ కంప్యూటరైజేషన్ చేయాలని, అందుకు సరిపడా పరికరాలు సిద్ధంగా ఉంచాలన్నారు. సంఘాల్లో రైతుల సభ్యత్వం, రుణాలు, పెట్టుబడులు, డిపాజిట్లు తదితర అన్నింటినీ ఆన్‌లైన్ చేయాలన్నారు. డేటాక్యాప్చర్ టూల్ స్థాయిలో కంప్యూటరైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని, ఆన్‌లైన్‌లో రైతుల ఆధార్ నెంబర్, వివిధ రికార్డులన్నీ ఉండాలన్నారు. సొసైటీల సిఇఒలు బాగా పని చేయాలన్నారు. ఆధార్ కార్డులు అందజేయాలని డిపాజిటర్లకు సూచించారు. కామన్ అకౌంటింగ్ సిస్టమ్ (సిఎఎస్), మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (ఎంఐఎస్) అమలు ద్వారా పిఎసిఎస్‌ల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని, రుణాలు పొందడానికి, రుణాలు రీషెడ్యూలు పనుల్లో రైతులకు వేగవంతమైన సేవలు అందించడానికి దోహదపడుతుందన్నారు. ఆయన వెంట జిల్లా కోపరేటివ్ అధికారులు, ఇన్‌ఛార్జి తహశీల్దార్ నాగార్జున, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

కోపల్లెలో సిబ్బందితో జెసి రాహుల్ కుమార్‌రెడ్డి


ఉష కీర్తి దుర్గాభవాని భారతి

సెమిస్టర్ ఫలితాల్లో శ్రీగౌతమీ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నరసాపురం

శ్రీగౌతమి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఆదికవి నన్నయ యూనివర్సిటీ నాలుగవ సెమిస్టర్‌లో ఉత్తమ ఫలితాలను సాధించి యూనివర్సిటీ రికార్డులను సాధించారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చినిమిల్లి దుర్గాప్రసాద్ తెలిపారు. గత మే నెలలో నిర్వహించిన నాలుగవ సెమిస్టర్ పరీక్షల్లో విద్యార్థులు తమ నైపుణ్యాన్ని కనబరిచారన్నారు. ఎంపిసి విభాగంలో ఎస్.ఉష 9.4 మార్కులతో, ఎంపిసిఎస్ విభాగంలో ఎ.కీర్తి 9.6, రేవు లక్ష్మీ ప్రసన్న 9.4, జి.దుర్గాభవాని 9.2, పిఎస్ఎస్.భారతి 9.1 మార్కులతో యూనివర్సిటీ ర్యాంకులను సాధించారన్నారు. సిబిజెడ్ విభాగంలో ఎం.విజయమణి 9.5, ఎ.సులోచన 9.0 మార్కులతో వారి వారి విభాగాలలో నైపుణ్యాన్ని చాటిచెప్పారని తెలిపారు. యూనివర్సిటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల పేరును కీర్తి ప్రతిష్టలను ఇనుమడింప చేశారని ఆయన అన్నారు. ఉన్నత మార్కులను సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ చినిమిల్లి దుర్గాప్రసాద్, ప్రిన్సిపల్ పి.శ్రీనివాస్, కళాశాల సూపరింటెండెంట్ సత్యనారాయణ అభినందించారు.

ప్రసన్న

సులోచన

విజయమణి

24న సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతుందని పాలకొల్లు మండల విస్తరణ అధికారి సంఘాని వెంకటేశ్వరరావు తెలియజేశారు. ఈ సమావేశం మండల ప్రజాపరిషత్ కేంద్రంలోని జిఎంసి బాలయోగి సమావేశ మందిరంలో నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపిటిసిలు, ప్రతిఒక్క సభ్యులు తప్పక హాజరు కావాలని కోరారు.

మొక్కలు నాటిన ఎంఎల్ఎ నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం ఎంపిడిఒ కార్యాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా మదర్ ఫర్ ల్యాండ్ అనే పేరు మీద ప్రతి ఊరిలోనూ, ప్రతి ఇంటిలోనూ మొక్కలు ఉండాలనే ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. పచ్చదనం అనేది మొక్కల పెంపకంతో పర్యావరణానికి అన్ని రకాలుగా దేశానికి, ప్రకృతికి మంచిదని ప్రతిఒక్కరూ మొక్కలు నాటి దాని ద్వారా ప్రకృతికి అన్ని రకాలుగా మంచి వాతావరణాన్ని ఇచ్చే విధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, మైలాబత్తుల సోనీ, గంటా కృష్ణ, పోలిశెట్టి సాంబ, కొఠికల శ్రీను పాల్గొన్నారు.

24న విజయవాడలో న్యాయవాదుల ధర్నా

ప్రజాశక్తి - తణుకు

ఈనెల 24వ తేదీన విజయవాడలో న్యాయవాదులచే నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జులై ఒకటో తేదీ నుంచి అమలు చేస్తున్న నూతన క్రిమినల్ చట్టాలను సవరణ చేయాలని కోరుతూ ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో విజయవాడలోని అలంకార్ సెంటర్ ధర్నా చౌక్ దగ్గర న్యాయవాదులు కొత్త చట్టాలకు వ్యతిరేకంగా నిరసన ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాల నుంచి న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. చట్టాలను సవరణ జరిగే వరకు న్యాయవాదులు ఈ పోరాటాన్ని కొనసాగిస్తారని మునుస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు కొరు వెంకటేశ్వర్లు, న్యాయవాదులు చింతపల్లి నాగేశ్వరరావు, ధనాల అప్పారావు పాల్గొన్నారు.

దత్తసాయి మందిరంలో అన్నసమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాలలో ఉన్న సాయిబాబా ఆలయాలు గురువారం యాత్రికులతో కళకళలాడాయి. మొగల్తూరులోని శ్రీదత్తసాయి మందిరంలో అన్న సమారాధన చేశారు. శేరేపాలెం గ్రామానికి చెందిన కొత్తపల్లి సాంబమూర్తి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో ప్రతి ఏటా చేసిన అన్న సమారాధనలో అధికసంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. అన్న సమారాధనలో పాల్గొన్న యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

బోసు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం మండలం మాజీ బిజెపి అధ్యక్షుడు ఆకుల వెంకట సత్యనారాయణ వరప్రసాద్(బోసు) కుటుంబాన్ని నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మ గురువారం మత్స్యపురిలో పరామర్శించారు. ఇటీవల బోసు అనారోగ్యంతో మృతిచెందారు. బోసు కుమారుడైన ఆకుల లీలా కృష్ణమూర్తి, సునీల్ చక్రపాణిలను ఎంపీ పరామర్శించి బోసు చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వీరవాసరం రైల్వే స్టేషన్‌లో పలు రైలు నిలిచే విధంగా చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు ఎంపీకి వినతిపత్రం అందజేశారు.

విద్యావ్యవస్థ బలాలు-బలహీనతలపై సర్వే

ప్రజాశక్తి - పాలకొల్లు

విద్యావ్యవస్థ బలాలు-బలహీనతలను అంచనా వేయడానికి దేశవ్యాప్తంగా నిర్వహించిన జాతీయ విద్యాప్రగతి, రాష్ట్ర విద్యాప్రగతి అంచనా సర్వే దేశమంతటా 2023 నవంబర్ 3న నిర్వహించారు. ఈ సర్వే ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు పాలకొల్లు, యలమంచిలి మండలాల్లో విధులను నిర్వర్తించారు. వీరికి పాలకొల్లు ఎంఇఒ జి.వీరాస్వామి, యలమంచిలి ఎంఇఒ ఆసీను సిబ్బంది విచ్చేసి ప్రశంసాపత్రం ఒక్కొక్కరికి రూ.500 మొత్తం 100 మంది విద్యార్థులకు రూ.50 వేలు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజ రాజేశ్వరి చేతుల మీదుగా విద్యార్థులకు గురువారం అందజేశారు. ఈ సర్వే ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించడానికి సహకరించిన కళాశాల విద్యార్థులను ప్రిన్సిపల్ ఈ సందర్భంగా అభినందించారు. విద్యార్థులు ఎర్న్ బై లెర్న్ భాగంగా చదువుకుంటూనే సంపాదించడం అనే దానికి ఇదొక ఉదాహరణగా తీసుకోవాలని ప్రిన్సిపల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వి.విజయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి సహాయ సహకారాలు అందిస్తాం : కలెక్టర్

భీమవరం : మైనార్టీల సంక్షేమానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని జిల్లాలోని మైనార్టీ సంఘాల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలపై చర్చించారు. ఈ సమావేశమునకు మైనార్టీ వర్గాలకు చెందిన ముస్లిం, క్రిస్టియన్, జైన వర్గాలకు చెందిన సంఘాల నాయకులు, పెద్దలు, నాయకులు, పాస్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మైనార్టీ వర్గాలకు చెందిన నాయకులు వారి సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. జిల్లాలోని అన్ని మైనార్టీ వర్గాలకు ప్రభుత్వ తరఫున అందించే సంక్షేమ పథకాలు, వారికి వచ్చే రాయితీలు అమలు అయ్యేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, ప్రోత్సహించినా కఠినచర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే ల్యాబ్‌లు, ఆసుపత్రులపై నిఘా పెట్టాలని ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో నాగరాణి అధ్యక్షతన పిసి అండ్ పిఎన్‌డిటి చట్టం అమలుపై జిల్లా అప్రాప్రియేట్ అథారిటీ నోడల్ అధికారి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో కొత్తగా 9 మంది అల్ట్రా స్కానింగ్ సెంటర్ల కోసం దరఖాస్తు చేసిన దరఖాస్తులను దొడ్డిపట్ల, లింగపాలెం, యండగండి, పోడూరు, అత్తిలి గ్రామాల పిహెచ్‌సిలకు, భీమవరం 1, తాడేపల్లిగూడెం 2, పాలకొల్లు 1 ప్రయివేట్ స్కానింగ్ సెంటర్లను ఆమోదించారు. ప్రతి పదేళ్లకు ఒకసారి స్కానింగ్ సెంటర్లు రెన్యువల్ కోసం వచ్చిన నాలుగు సెంటర్లను ఆమోదించారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రక్తదానం చేస్తున్న యువకుడు

సుబ్బారావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - కాళ్ల

దొడ్డనపూడి సర్పంచి కొల్లి సుబ్బారావు భాస్విని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా విశేషసేవలు అందించడం అభినందననీయమని మాజీ ఎంపిపి ఆరేటి వెంకటరత్నం ప్రసాద్ అన్నారు. దొడ్డనపూడి గ్రామంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. భాస్విని చారిటబుల్ ట్రస్ట్, హోప్ చారిటబుల్ ట్రస్ట్, ఆనంద బ్లడ్ బ్యాంకు వారి సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. 60 మంది యువకులు రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో అరేటి పద్మారావు, అరేటి సందీప్, జనసేన నాయకులు పిటాక అదిపనస రామయ్య, కొల్లి రామయ్య, యిర్రింకి జగన్, దేశంశెట్టి మధు, యాతం తేజ, కొల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

గణపవరం: మండలంలోని అర్ధవరం గ్రామంలో జాతీయ అందత్వ నివారణా కార్యక్రమం సందర్భంగా గురువారం అర్ధవరం జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గణపవరం కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్ బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆకుకూరలు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని అన్నారు. 197 మందికి కంటి పరీక్షలు చేయగా వారిలో 15 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు చెప్పారు. పిఎస్.దివ్యభారతి, ఎన్ఎం.ఎల్లేలక్షికాంతం, హెల్త్ అసిస్టెంట్ బి.రవికుమార్, ఎంఎస్.యోహాన్, వైద్యులు ఐ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల వసతి గృహం ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారి సుజాతరాణి

భీమవరం : ప్రత్యేక అవసరాలు కలిగిన బాలికలకు వసతి గృహం ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖ అధికారి బి.సుజాతా రాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఆకివీడు మండలం పెదకాపవరంలో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనంలో ప్రత్యేక అవసరాలు కలిగిన బాలికలకు వసతి గృహం ఏర్పాటు చేయుటకు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలతో పనిచేసిన అనుభవం కలిగిన స్వచ్ఛంద సేవా సంస్థల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులు ఆయా స్వచ్ఛంద సేవా సంస్థల రిజిస్ట్రేషన్ ధృవీకరణ పత్రం, సంస్థ సభ్యుల వివరములు, సంస్థ మూడు సంవత్సరముల సేవా కార్యక్రమముల వివరములను మూడు సెట్లను ఈనెల 28వ తేదీ లోగా భీమవరం కలక్టరేట్‌లోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ కార్యాలయలో అందజేయాలని కోరారు.

గ్రామసభలను విజయవంతం చేయాలి

ఆచంట: గ్రామ పంచాయతీలో కనీస అవసరాలకు మొదట ప్రాధాన్యతనిస్తూ గ్రామస్థాయిలో ప్రజా సమస్యలు తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించేందుకు గ్రామ సభలు ఎంతగానో ఉపయోగపడతాయని ఎంపిడిఒ పి.నరసింహప్రసాద్ అన్నారు. గురువారం ఎంపిడిఒ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులకు గ్రామ సభలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి నుంచి మండలంలో గ్రామసభలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

పెనుమంట్ర : ఈనెల 23వ తేదీ శుక్రవారం మండలంలోని అన్ని గ్రామాలలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టంకు సంబంధించి ప్రత్యేక గ్రామసభలు జరుగుతాయని స్థానిక ఎంపిడిఒ పి.పద్మజ తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహించే ఈ సభలకు ప్రత్యేక అధికారులను, మండలంలోని వివిధ శాఖల ఉద్యోగులను నియమించినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఉపాధి చట్టంకు సంబంధించి జరుగుతున్న పనులుపైన, ఇంకా కొత్త పనులు గుర్తించి ఆయా గ్రామ సభల్లో చర్చించడం జరుగుతుందని ఆమె అన్నారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామపంచాయతీలలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నామని ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్ తెలిపారు. ఈ గ్రామసభలలో ప్రజలు పాల్గొని అభివృద్ధిపై చర్చించాలని ఆయన సూచించారు. గ్రామ సభలకు పలు శాఖల అధికారుల హాజరుకానున్నారని ఆయన తెలిపారు.

తణుకు రూరల్ : ఉపాధి హామీ చట్టంపై అవగాహన కల్పించేందుకు ఈనెల 23న మండలంలోని అయా గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ కె.కిరణ్ తెలిపారు. కోనాల, ముద్దాపురం, దువ్వ, మండపాక, తేతలి గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి జరుగుతాయన్నారు. వేల్పూరు, కొమ్మరవరం, యర్రాయిచెరువు, మహాలక్ష్మిచెరువు గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతాయని ఆయన తెలిపారు.

పాలకొల్లు : లంకలకోడేరు గ్రామ సచివాలయం వద్ద జరిగే గ్రామసభలో రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు పాల్గొంటారని మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. రెవిన్యూ ఉన్నతాధికారులు సభలో పాల్గొంటారని తెలిపారు.

పొలంబడిలో రైతులకు అవగాహన

పాలకోడేరు: ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వ్యవసాయలో పురుగులు ప్రభలే అవకాశం ఉందని, ఈ నేపథ్యంలో రైతుల నివారణకు చర్యలు తీసుకోవాలని భీమవరం వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్.శ్రీనివాస్ సూచించారు. వేంద్ర గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాస్, మండల వ్యవసాయ అధికారి వి.నారాయణ రావు రైతులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. రైతులకు వరి చేలలో నష్టాన్ని కలిగించే కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగు గురించి ప్రయోగాత్మకంగా తెలియజేసి రైతులకు అవగాహన కల్పించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు పావని, మధుబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకోడేరు : రైతులకు సూచిస్తున్న అధికారులు

పెనుగొండ : తక్కువ పెట్టుబడితో మేలైన అధిక దిగుబడి సాధన పొలంబడి కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ప్రాంతీయ వరి పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ రమేష్ బాబు అన్నారు. గురువారం మండలంలో చిన్నమాలం గ్రామం రైతులతో మాట్లాడుతూ రైతులకు సిఫార్సు చేస్తూ రసాయన ఎరువు ఎలా వినియోగించాలో, సేంద్రియపు ఎరువుల జీవన ఎరువులను వాడడం అలవాటు చేసుకోవాలని తెలియజేశారు. ఈ పొలంబడి కార్యక్రమంలో డాక్టర్ దయాల్ ప్రసాద్(బ్రీడింగ్ శాస్త్రవేత్త), డాక్టర్ ఎంవి.కృష్ణ, మండల వ్యవసాయాధికారి పి.స్పందన మాట్లాడుతూ ప్రతి గురువారం పొలంబడి కార్యక్రమంలో మెలకువలను తెలుసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు.

మొగల్తూరు : మామిడి తోటలలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారి కె.ప్రియదర్శిని రైతులకు సూచించారు. మండలంలోని రామన్నపాలెంలో రైతు భరోసా కేంద్రంలో గురువారం మామిడి రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పలు సూచనలు చేశారు.

జాబ్‌కార్డులు అందజేస్తాం

ఉండి: ఉపాధి హామీ చట్టంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇవ్వడం జరుగుతుందని స్టేట్ రిసోర్స్‌పర్సన్ గోవిందరావు అన్నారు. గురువారం సాయంత్రం ఉండి గ్రామపంచాయతీ ప్రాంగణంలో గ్రేడ్ 5 కార్యదర్శి శ్రీలత ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశాన్ని ఉద్దేశించి గోవిందరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి వంద రోజులు పని దినాలు ఇవ్వడమే లక్ష్యంగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారని అన్నారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి ఉండిలో 899 జాబ్ కార్డులు ఉండగా వారిలో 569 మందికి 158 పనిదినాలు కల్పించగా 43,32,719 రూపాయలు కట్ చేసినట్లు వారు తెలిపారు.

విద్యార్థులకు కలుపు మొక్కలపై అవగాహన

పార్థీనియం వారోత్సవాల ముగింపులో ఎడిఆర్ డాక్టర్ టి.శ్రీనివాస్

పెనుమంట్ర : వ్యవసాయంలో పంటలు వృద్ధిచెంది, చక్కని ఫలసాయం అందాలంటే ఎప్పటికప్పుడు కలుపు మొక్కలు ఎదగకుండా నివారించాలని మార్టేరు ఆచార్య ఎన్‌జి.రంగా ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఉప సంచాలకులు డాక్టర్ టి.శ్రీనివాస్ అన్నారు. గురువారం స్థానిక వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులకు నిర్వహించిన పార్థీనియం వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అవగాహన కల్పించారు. కలుపు మొక్కల్లో అత్యంత ప్రమాదకరమైన వయ్యారిభామ మొక్క ప్రస్థానం గురించి వివరించారు. ఈ మొక్క అమెరికాలోని ఉష్ణ ప్రాంతంలో పుట్టి, అక్కడ నుంచి మన దేశానికి దిగుమతి అయిన ఆహార ధాన్యాలతోపాటు 1956లో మనదేశం చేరిందన్నారు. ఆ తర్వాత మొదటిసారిగా 1973లో ఈ మొక్కను మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో కనుగొన్నారు. మన దేశం కాక దీని ఆక్రమణ బారినపడ్డ ఇతర ప్రాంతాలు ఆస్ట్రేలియా, ఇంకా ఆఫ్రికాలో కొన్ని ప్రదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. వయ్యారిభామ అత్యంత ప్రమాదకరమైన కలుపు మొక్క అని, ఇది మొలిచిన చోట ఇతర పంటల ఎదుగుదలను కుంటుపరుస్తుంది కనుక దిగుబడి తగ్గుతుందని తెలిపారు. నివారణకు పంట పొలాల్లో మొలిచిన వయ్యారిభామ పూత పూయకముందే వేర్లతో సహా పీకి బురదలో తొక్కెయ్యాలన్నారు. తర్వాత నీరు పెడితే అది బాగా మురిగి పచ్చరొట్టె ఎరువుగా మారుతుంది. లేదా ఇది పూత దశకు రాకముందే వేళ్లతో సహా పీకి తగలబెట్టాలని, కాలుతున్నప్పుడు వచ్చే పొగకు దూరంగా ఉండాలని చెప్పారు. తంగేడు చెట్లు ఉన్న ప్రాంతంలో ఈ మొక్క మొలవదని, వయ్యారిభామను నివారించే శక్తి తంగేడు మొక్కకు మాత్రమే ఉంటుందన్నారు. పొలాల గట్లు, బంజరు భూముల్లో తంగేడు చెట్లను తొలగించకూడదని హెచ్చరించారు. ఈ కలుపు మొక్క పూత దశకు రాకమునుపే 10 లీటర్ల నీటికి 5 కిలోల ఉప్పు కలిపి ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. అలా చేస్తే వయ్యారిభామ కలుపు మొక్కలు తిరిగి అక్కడ మొలవవని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ ఉప ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు, పరిశోధనా స్థానంలోని పలువురు శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.సుజాత రాణి

మాట్లాడుతున్న ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సుజాత రాణి

ప్రజాశక్తి - కాళ్ల

బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని, బాల్య వివాహాలు అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఐసిడిఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.సుజాత రాణి కోరారు. కాళ్ల మండలపరిషత్ కార్యాలయంలో ఐసిడిఎస్, పంచాయతీ రాజ్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులకు, సిబ్బందిలకు ఒకరోజు పాటు శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. ఐసిడిఎస్ ఆకివీడు ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. డిసిపిఒ ఆర్.రాజేష్ మాట్లాడుతూ చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుకునే వయసులోనే వివాహం చేసి చిన్నారుల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. బాల్యవివాహాల నిరోధక చట్టం 2006, 31, 39 జిఒ విధి విధానాలను వివరించారు. సిడిపిఒ వి.వాణి విజయరత్నం మాట్లాడుతూ బాల్య వివాహ నేరం చట్టం ప్రకారం శిక్షార్హులు, బాల్యవివాహం చేసిన, చేసుకున్న, ప్రోత్సహించిన రెండేళ్ల జైలు, రూ.లక్ష జరిమానా అనే నినాదాలతో తల్లిదండ్రుల్లో, విద్యార్థుల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.స్వాతి, తహశీల్దార్ నాగార్జున, ఎంఇఒ-1 ఎ.రవీంద్ర, ఇఒపిఆర్‌డి ఎంవి.భాస్కరరావు, సూపర్‌వైజర్‌లు కె.సూర్యకుమారి, పి.పార్వతి, విఆర్ఒలు, గ్రామ కార్యదర్శులు, ఎంఎస్‌కె, అంగన్‌వాడీ టీచర్లు, పూజారులు, పాస్టర్‌లు పాల్గొన్నారు.

గణపవరం: మండలంలోని కాశిపాడులో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గురువారం బేటి బచావో బేటి పడావో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పిప్పర సెక్టర్ సూపర్వైజర్ సిహెచ్.దుర్గ భవాని మాట్లాడుతూ ఆడపిల్లలను రక్షించుకోవలసిన బాధ్యత అందరిమీద ఉందన్నారు. ఆడపిల్లల సంరక్షణ విషయంలో తల్లిదండ్రులు బాధ్యత ఎంతో ఉందని తెలిపారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ఉపాధ్యాయులు ఎవిఎస్ఎస్‌బిఆర్.ప్రసాద్, సిహెచ్‌ఒ.ఆంధ్రు రమ్యశ్రీ, మహిళా పోలీసు డి.ఫణిప్రియ, ఆశాలు కృష్ణకుమారి, వరలక్ష్మీ, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌కు కన్నీటి వీడ్కోలు

ఆకివీడు : విజయవాడలో గ్రేహౌండ్ విభాగంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ బుధవారం మృతి చెందిన స్థానిక సమతా నగర్‌కు చెందిన కొట్నాని తారకరామారావుకు(38) గురువారం అంతిమ సంస్కారాలు స్వగ్రామంలో నిర్వహించారు. సమతా నగర్‌కు చెందిన రామారావు సుమారు గత పది సంవత్సరాలుగా విజయవాడలో గ్రేహౌండ్స్ విభాగంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం విజయవాడ నగరంలో మోటర్ సైకిల్‌పై వెళుతున్న అతను రోడ్డు ప్రమాదం జరిగి మృతిచెందాడు. అతని మృతదేహాన్ని గురువారం ఉదయం స్వగ్రామం తీసుకువచ్చారు. అక్కడ అధికారుల అంచనాలతో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

స్ఫూర్తిదాయకులు మెగాస్టార్ చిరంజీవి

ఘనంగా పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎంతో మందికి స్ఫూర్తి మెగాస్టార్ చిరంజీవి అని, తెలుగు ప్రజలకు అన్నయ్యగా మారిన చిరు అభిమానుల కోసం ఎప్పుడూ ముందుంటారని, కష్టాల్లో ఉన్నవారికి సాయం చేసే ఆపద్బాంధవుడు చిరంజీవి అని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. గురువారం భీమవరం పట్టణ చిరంజీవి ఫ్యాన్స్ ఆధ్వర్యంలో అంకాల ఆర్ట్స్ అకాడమీలో మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి కృష్ణ అభిమాని బంగారు సుబ్బారావుకి చిరంజీవి అభిమానుల సహకారంతో రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, పొత్తూరి బాపిరాజు, యాస అనిల్ కొప్పర్తి కోటి, కొప్పినీడి బాబీ, పోకల కిషోర్ పాల్గొన్నారు.

ఆచంట: వల్లూరు గ్రామంలో జనసేన ఆధ్వర్యంలో పద్మభూషణ్ మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథులుగా ఆచంట నియోజకవర్గ ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ తనయులు పితాని వెంకట్, జనసేన రాష్ట్ర నాయకులు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ, ఉమ్మడి పగో జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు కోపల్లి శ్రీనివాస్ విచ్చేసి జనసైనికులకు, మెగా అభిమానులకు, గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధులకు, వికలాంగులకు, చీరలు పంపిణీ చేశారు.

నరసాపురం: నరసాపురం పట్టణం అంబేద్కర్ సెంటర్‌లో చిరు అండ్ పవన్ యూత్ ఆధ్వర్యంలో చిరంజీవి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ కార్యక్రమంలో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: చిరంజీవి 69వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉన్నమట్ల లోకేష్, పాలూరి శేషు నాయుడు, పశ్చిమ గోదావరి జిల్లా కాపు యువత జిల్లా అధ్యక్షులు మారిశెట్టి అజయ్ బాబు ఆధ్వర్యంలో గురువారం లార్డ్స్ ఆఫ్ లైఫ్ అనాథ ఆశ్రమంలో కేక్ కట్ చేసి చాక్లెట్స్, బిస్కెట్లు, పండ్లు పంపిణీ చెయ్యడంతో పాటు పిల్లలకు మెడికల్ చెకప్ చేయించేందుకు, యాగర్లపల్లి ప్రేమాలయంలో ఉన్న వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మొగల్తూరు : పలు గ్రామాల్లో పద్మ విభూషణ్ మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని చిరంజీవి గ్రంథాలయం వద్ద గురువారం రాత్రి చిరు, పవన్ అభిమానుల మండల శాఖ అధ్యక్షుడు దాసరి కృష్ణాజి ఆధ్వర్యంలో అభిమానులు ఏర్పాటుచేసిన కేకును ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడులు కోసి ప్రజలకు పంపిణీ చేశారు.

పేపర్ ఆర్ట్‌తో ఉపముఖ్యమంత్రి చిత్రం

మొగల్తూరు : ఏనుగు వానిలంక బాడవ గ్రామానికి చెందిన చింత సత్యసాయి శివప్రసాద్ పలు విభాగాల కళలలో ప్రతిభ చూపుతున్నాడు. శివ ప్రసాద్ నాలుగు వేల మీటర్ల దారాన్ని ఉపయోగించి 65 గంటల శ్రమించి రూపొందించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటం విశేషంగా ఆకట్టుకుంటుంది. పేపర్ కటింగ్ ఆర్ట్ ద్వారా వినాయకుడు, సింహం, పులి, తదితర చిత్రాలను రూపొందించాడు. పెన్సిల్ మొనపై జాతీయ పతాకం, విమానం నమూనా, తండ్రి కుమారులు తదితర చిత్రాలను రూపొందించారు. అవి చూపరులని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వాటిని మొగల్తూరు అభ్యాస కళాశాలకు తీసుకొచ్చిన సందర్భంగా పలువురు విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
డెటార్ ఐ.పి.నెం.20/2024.

బిట్వీన్:
1.కొత్తపల్లి బాల మురళీకృష్ణ .. పిటీషనర్
V/s
2.పూసల రామ్‌మోహన్‌రావు వగైరా ..రెస్పాండెంట్స్/1 to 41.

ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై నెంబరు గ్రంధములో పిటీషనర్, రెస్పాండెంట్స్‌పై ఇన్సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని డెటార్ ఐ.పి. శ్రీకోర్టు వారు ముందు వాజ్యము దాఖలు చేసియున్నారు. అందుపై యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఏవిధమైన అభ్యంతరములు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల ది.23.09.2024లో సం॥రం॥ తేదీన ఉదయం 10.30 ని॥లకు శ్రీకోర్టు వారి ముందు స్వయంగా గాని, న్యాయవాది ద్వారా కాని హాజరై, శ్రీ కోర్టు వార్కి అభ్యంతరములు గాని ఆక్షేపణలు గాని తెలియజేయవలెను. లేనియెడల పిటీషనరు తరపున తీర్మానించబడునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

తంగెళ్ళ వెంకటేశ్వరరావు
ఎం.ఎ.బి.ఎల్. న్యాయవాది,
నరసాపురం నరసాపురం, ప.గో.జిల్లా, ఆం.ప్ర.,
ది.23.08.2024 సెల్ నెం.9848273438

IN THE COURT OF THE HONBLE ADDL. CIVIL JUDGE (SENIOR DIVISION) ELURU, W.G.DIST.

I.A.659/2024 in O.S.No.33/2022

Between:
Methukumilli Rama Tulasi ...Petitioner
&
Marumudi Venkamma & Others ....Respondents

2.Konda@ Marumudi Lakshmi Nirmala, W/o.Yahoshuva, R/o.D.No.12-16-40, 2nd Street, Gandhi Nagar, Nidadavolu Village & Mandal, W.G.Dist.,
5. Ganupamu Appalakonda @Aruna, W/o.Kanakarao, R/o.D.No.2-20, Goods Shed Road, Pandurangapuram, Eluru, Eluru Dist.,
7. Adari Kanakavara Vijayalakshmi, W/o.Balaji, R/o.D.No.10-17, Gowrisankarapuram, Makkinavarigudem Post, T.Narasapuram Mandal, Eluru Dist.,
8. Amballa Sanjive, S/o. Durga Prasad, R/o.D.No.4-12, Undarajavaram Village, Pothunuru Post, Denduluru Mandal, Eluru Dist.,
9. Samudrala Leela Maheswara Rao, S/o. Venkata Madhusudhana Rao, GPA Agent, R/o.R.R.Pet, Eluru, Eluru Dist.,
R10: Marumudi Raju, S/o.(Late) Venkateswara Rao, R/o.D.No.4-14, Madepalli Village, Eluru Mandal, Eluru Dist.
R11: Ammireddy Prasad, S/o. (Late) Nageswara Rao, R/o.D.No.9-149, Indira Nagar, Bapulapadu Village, Krishna Dist.

పై నెంబరు దావాలో పై ప్రతివాదులకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున పై కోర్టు వారు R2, R5, R7, R8, R9, R10, R11 ప్రతివాదులు అయిన మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా దావా నోటీసులు అమలు చేయుటకు ఆర్డరు వేసి యున్నారు. పై దావా ది.05.09.2024వ తేదీ ఉదయం గం. 10.30 ని॥కు శ్రీకోర్టుకు హాజరు అయి మీ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా మీ పరోక్షమున విచారించబడును.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
ఎన్.వై.వి.ప్రసాద్, ఎన్.రాముడు
ఏలూరు అడ్వకేట్స్, ఏలూరు.
22-5-2024 సెల్:7780194120

పాదుల తొలగింపు

ప్రజాశక్తి వార్తకు స్పందన

నరసాపురం: నరసాపురం పట్టణంలోని కోవెల గుడి వద్ద ట్రాన్స్‌ఫార్మర్స్ చుట్టూ మొక్కల పాదులు పెరిగిపోయాయి. దీనిపై గురువారం ప్రజాశక్తిలో 'ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చిమొక్కలు' అనే వార్తకు గురువారం విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వాటిని తొలగించారు.

పిచ్చి మొక్కలను తొలగించిన అధికారులు

NAME CHANGE

I, **BOKKA BABY KUMARI** (Maiden Name) **KADALI HEMA SRI** (Married Name) wife of Anjaneyulu resident of Door No.4-64, Koneru Gattu, Chintala garuvu, Vaddiparru, Poduru Mandal, West Godavari District, shall hence forth be known as **BOKKA HEMA SRI** (Maiden Name) **KADALI HEAMA SRI** (Marital Name) wife of Anjaneyulu for purpose of correction of wrong entries occurred in School Records due to Parental mistake.

మార్కులిస్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం కేశవరం గ్రామ కాపురస్థులైన జోగి సాయి శ్వేత తండ్రి శివాజీ అను నేను నా యొక్క ఇంటర్ మార్క్ లిస్ట్ ఒరిజినల్ సర్టిఫికెట్ కేశవరం నుండి గణపవరం SBI సెంటర్లో జిరాక్స్ తీయించుకుని మా ఇంటికి వచ్చే మార్గ మధ్యలో ఇంటర్ మార్క్ లిస్ట్ మరియు జిరాక్స్ తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు ఎంత వెతికిన దొరిక లేదు దొరికినవారు ఈ కింది ఫోన్ నెంబర్ కు తెలియజేయగలరు .

జోగి సాయి శ్వేత, తండ్రి శివాజీ, కేశవరం గ్రామం, గణపవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా. సెల్ 7993751833

NAME CHANGE

I, **KUDIPUDI BHUVANESWARI** (Maiden Name) **KADALI BHUVANESWARI** (Married Name) wife of Hareesh resident of Door No.3-104, Chintalagaruvu, Vaddiparru, Poduru Mandal, West Godavari District, shall henceforth be known as **KUDIPUDI PAVANI** (Maiden Name) **KADALI PAVANI** (Marital Name) wife of Hareesh for purpose of correction of wrong entries occurred in School Records due to Parental mistake.

ప్రకటన

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఒ.యస్.నెం.211/2014

బిట్వీన్ :
చేబ్రోలు రాంబాబు వగైరాలు ...వాద్లు
మరియు
బోడిగడ్ల రాంబాబు వగైరాలు ...ప్రతివాద్లు

పై నెంబరు దావా ఆస్థి మీరు ది.08-05-2018 సం॥ తేదీన బోడిగడ్ల రాంబాబు గారి వద్ద క్రయము పొందనారని మిమ్ములను అనగా పర్వతనేని లక్ష్మణ ప్రసాద్, తండ్రి కోటేశ్వరరావు, ఇంటి నెం.29-4-44/3రు, శాంతినగర్, ఏలూరు సిటీని పై నెంబరు దావాలో 3వ ప్రతివాదిగా చేర్చినారు. మీకు ఎన్నిపర్యాయములు దావా సమన్లు పంపిననూ తీసికొనక నిరాకరించుచున్నారు. గాన మీరు ది.29-8-2024 సం॥రం తేదీ ఉదయం గం.10.30 ని॥లకు పైకోర్టు వారి యెదుట స్వయముగా కాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి మీ వాదన దాఖలు చేసుకొన వలయును. అట్లు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానము చేయుదురు.

పి.ఆంజనేయరాజు
అడ్వకేటు, తాడేపల్లిగూడెం.
సెల్ : 9848018256

ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో నరసాపురం
ఐ.పి.నెం.3/2002

బిట్వీన్:
1. బండి నాగరత్నం, భర్త: సత్యనారాయణ. డోరునెం.2-117/2, స్కూలు పెదమామిడిపల్లి, పాలకొల్లు మండలు,
2. బండి సత్యనారాయం. తండ్రి సుబ్బారావు డోర్ నెం.2-117/2, స్కూలు, పెదమామిడిపల్లి, పాలకొల్లు మండలం. ...పిటీషనర్లు
మరియు
1. గుత్తులు శ్రీనివాసరావు మరియు 30 నుండి వగైరా ...రెస్పాండెంట్లు

పై నంబరు ఇన్సోల్వెన్సీ పిటీషన్లో పిటీషనర్లు వారికి గల బాకీలను తీర్చలేని పరిస్థితులలో 31 మంది రెస్పాండెంట్స్ పై, డెటార్ ఇన్సోల్వెన్సీ పిటిషన్ దాఖలు చేసియున్నారు. మరియు సదరు ప్రొవిన్సియల్ ఇన్సల్వెన్స్ ఆక్టు అండర్ సెక్షన్ 31(1) ప్రకారము జనరల్ ప్రొడక్షన్, వగైరా రిలీఫ్స్ కోరుచూ దాఖలు చేసియున్నారు. దానిపై శ్రీకోర్టు వారి ఉత్తర్వుల మేరకు పైన చూపించిన 31 మంది. రెస్పాండెంట్లకు గానీ, మరి ఏ యితరులకు గాని, ఏమైనా అభ్యంతరములు ఉన్నయెడల ది.02-09-2024 సం. తేదిన ఉదయం గం.10-30 ని.లకు శ్రీకోర్టు వారి యెదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరై పై పిటిషన్ నందు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలియజేసు కోవలెను. లేనియెడల పై పిటీషన్ మీకు పరోక్షముగా తీర్మానించబడును. దరిమిలా వచ్చే ఆక్షేపణలు ఏమీ పిటీషనర్లను బైండ్ చేయవని యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.

కామన బాల సత్యనారాయణ,
స్థలం: నరసాపురం, పిటీషనరు తరపు అడ్వకేట్,
తేది.20-8-2024 నరసాపురం, సెల్:9848660100